# సాక్షి శ్రీకాకుళం

మంగళవారం : 30 : ఏప్రిల్ : 2024






**వైఎస్సార్‌సీపీ కంచుకోట**

నరసన్నపేట వైఎస్సార్ సీపీ కంచుకోటగా మారుతోంది. భారీగా చేరికలు జరుగుతున్నాయి.

- 8లో



**పిడుగు పాటు..**

ఇచ్ఛాపురం మండలంలో ఓ ఇటుక బట్టీపై పిడుగు పడింది. ఐదుగురు గాయపడ్డారు.

- 8లో

**డిగ్రీ 4, 2 సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం**

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ 4, 2 రెండు సెమిస్టర్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. 62 పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. రెండో సెమిస్టర్ ఉదయం 9 నుంచి 12 గంటలు వరకు నిర్వహిస్తున్నారు. మే నెల 16వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. నాలుగో సెమిస్టర్ మధ్యాహ్నం రెండు నుంచి ఐదు వరకు నిర్వహిస్తున్నారు. పరీక్షలు మేనెల 10వ తేదీ వరకు జరగనున్నాయి. పరీక్షల నిర్వహణను ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ పర్యవేక్షిస్తున్నారు.

## న్యూస్‌రీల్

### 'ఎన్నికల వ్యయం నమోదు చేస్తాం'

**శ్రీకాకుళం పాతబస్టాండ్ :** పార్లమెంట్, శాసన సభ నియోజకవర్గ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చును వారి రిజిస్టర్లతో సంబంధం లేకుండా ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాల మేరకు తమ రిజిస్టర్లలో పక్కాగా నమోదు చేస్తామని ఎన్నికల సాధారణ పరిశీలకులు శేఖర్ విద్యార్థి పేర్కొన్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత ఆయన శ్రీకాకుళం లోక్‌సభ, శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు, ఏజెంట్లతో కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం సాయంత్రం మాట్లాడారు. రూ. 10 వేలకు మించి ఉండే లావాదేవీలను చెక్కు రూపంలో లేదా డిజిటల్ రూపంలో చేయాలని ఆయా అభ్యర్థులకు స్పష్టం చేశారు. నామినేషన్ వేసినప్పటి నుంచి ఖర్చును లెక్కిస్తామని, తమ వద్దనున్న వేరే రిజిస్టర్‌లో ఖర్చును సరిపోల్చి చూస్తామని వివరించారు. తేడా ఉంటే నోటీసులు జారీ చేస్తామని, ఎలాంటి సందేహాలున్నా ఆయా రిటర్నింగ్ అధికారులు కలిసి నివృత్తి చేసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఆర్డీవో సీహెచ్ రంగయ్య పాల్గొన్నారు.

### 1 నుంచి పింఛన్ల పంపిణీ



**శ్రీకాకుళం పాతబస్టాండ్:** మే నెల 1 నుంచి సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ నెలకు గాను అన్ని రకాలు కలిపి 3,20,886 పింఛన్లు విడుదలయ్యాయని, అందుకుగాను రూ. 93,67,64,000 నగదు విడుదలైనట్లు తెలిపారు. ఇందులో 2,42,957 మంది పింఛనుదారులకు నేరుగా డీబీటీ విధానంలో వారి బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. ఆధార్‌కు అనుసంధానమైన బ్యాంకు ఖాతాల్లో మాత్రమే నగదు జమ చేస్తామని పేర్కొన్నారు. ఆధార్ అనుసంధానం లేని పూర్తిగా వయోభారంతో ఉన్నవారికి, మరికొంతమందికి అంటే 77,929 మందికి నేరుగా గ్రామసచివాలయం కార్యదర్శుల ద్వారా ఇంటికొచ్చి అందజేస్తామని వివరించారు.

### ముగ్గుల పోటీలు రేపు

**శ్రీకాకుళం పాతబస్టాండ్ :** స్వీప్ కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం ఏడురోడ్ల కూడలి వద్ద మున్సిపల్ ఉన్నత పాఠశాల మైదానంలో మే 1న ముగ్గుల పోటీలు, వంటల పోటీలు నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

### రూ. 29.50 లక్షలు పట్టివేత



నగదును లెక్కిస్తున్న ఎస్ఎస్‌టీ, డీఎఫ్ఎస్‌టీ టీమ్‌లు

**శ్రీకాకుళం క్రైమ్ :** విశాఖపట్నం నుంచి జిల్లాకేంద్రంలోకి ప్రవేశించే సింహద్వారం కూడలి వద్ద ఓ బస్సులో సోమవారం భారీగా నగదు పట్టుబడింది. వివరాల్లోకి వెళ్తే.. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం బయల్దేరిన నాన్‌స్టాప్ ఏసీ బస్సు శ్రీకాకుళం సింహద్వారం వద్దకు రాగానే డీఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ టీమ్‌లు డిప్యూటీ తహసీల్దార్ ఈవీఆర్ బాబు బాబు సమక్షంలో తనిఖీలు జరిపారు. అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా ఆదేశాల మేరకు ఈ తనిఖీ చేశారు. తనిఖీలో ఓ ఫౌండేషన్ ప్రతినిధికి సంబంధించి ఎలాంటి ఆధారిత పత్రాలు లేకుండా రూ. 29.50 లక్షలు బ్యాగులో ఉండటాన్ని చూసి పట్టుకున్నారు. మెళియాపుట్టిలో స్కూళ్ల నిర్మాణం జరుగుతోందని, ఉద్యోగుల శాలరీలకు సంబంధించిన సొమ్ము ఇదని ఆ వ్యక్తి చెప్పినా సరైన పత్రాలు చూపించకపోవడంతో నగదును స్వాధీనం చేసుకుని ఎస్ఎస్‌టీ టీమ్‌కు అప్పగించారు. దీనిపై సంబంధిత ఆర్వోకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది. ఈ దాడుల్లో ఎ.మోహనరావు, పీసీ ప్రసాద్, వీసీ దత్తాత్రేయలు పాల్గొన్నారు.



ఆయన చేతిలో పెట్టిన రోడ్లు నాశనమయ్యాయి. కాంట్రాక్టర్‌గా ఆయన ఆధ్వర్యంలో నిర్మించిన కల్వర్టులు కూలిపోయాయి. సోదరుడితో కలిసి కట్టిన చెక్‌డ్యామ్‌లు ధ్వంసమయ్యాయి. అధికారం ఉన్నది అవినీతి చేయడానికి మాత్రమేనని భావించే కూన రవికుమార్ ఘన కార్యాలివి. 2014–19 వరకు ఈ టీడీపీ నేత చేసిన అక్రమాలకు అడ్డూ అదుపు లేదు. పనులు కాంట్రాక్టుకు తీసుకోవడం, నాసిరకంగా పూర్తి చేసేసి నిధులు తన ఖాతాలో జమ చేసుకోవడం, ఆ తప్పులకు అధికారులు బలికావడం ఆ కాలంలో పరిపాటిగా ఉండేది. అందుకే ఆ తర్వాతి ఎన్నికల్లో కూనను నియోజకవర్గ ప్రజలు ఛీ కొట్టారు.

# పేరుకే కూన.. అక్రమాలు సొనా..!



బూర్జ మండలం కొల్లివలస జంక్షన్ నుంచి గుత్తావల్లి వరకు కూన సోదరుడు వెంకట సత్యనారాయణకు చెందిన విజయలక్ష్మీ కన్‌స్ట్రక్షన్ కంపెనీ వేసిన ఆర్ అండ్‌బీ రోడ్డు కొన్ని రోజులకే ధ్వంసమైపోయింది.

- 2014–19లో విచ్చలవిడిగా టీడీపీ నేత అక్రమాలు
- ఆ ఐదేళ్లు చెలరేగిపోయిన కూన రవికుమార్, ఆయన సోదరుడు
- సొంత కన్‌స్ట్రక్షన్ కంపెనీ పేరుతో నాసిరకం పనులు
- వీరి అక్రమాలకు అధికారులు బలి

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

అధికారమిస్తే ప్రజలకు మంచి పనులు చేయాలి. టీడీపీ నేతలకు అధికారమిస్తే అడ్డగోలుగా సంపాదించుకోవడానికే అన్నట్టుగా వ్యవహరించారు. 2014–19లో జరిగిన అక్రమాలు, చేసిన పాపాలు చూస్తే...వీరికి అధికారమిచ్చి తప్పు చేశామని ప్రజలు బాధపడ్డ పరిస్థితి కన్పించింది. టీడీపీ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాల్లో ఆమదాలవలస టీడీపీ నేత కూన రవికుమార్, ఆయన సోదరుడు సత్యనారాయణల పాత్ర ఇంకా ఎవరూ మరువలేదు. వారి అక్రమాలకు కేరాఫ్‌గా ఉన్న రోడ్లు, కల్వర్టులు, చెక్‌డ్యామ్‌లు నాశనమైపోయాయి. ప్రజాధనం వారి జేబుల్లోకి వెళ్లగా, ప్రజలకు కష్టాలు మిగిలాయి.

- పొందూరు మండలం కొల్లిపేట నుంచి ఆమదాలవలస మండలం నెల్లిమెట్ట వరకు రెల్లి గెడ్డ డ్రైన్ అభివృద్ధి పనులు చేపట్టారు. కేంద్రప్రభుత్వం నుంచి వచ్చిన నాబార్డు ఆర్‌ఐడీఎఫ్ -21 గ్రాంట్ నుంచి దాదాపు రూ.10కోట్లు వరకు ఖర్చు పెట్టారు. చెక్‌డ్యామ్, రక్షణగోడలు పనులు చేపట్టారు. పేరుకి ఆర్‌కేఎస్ అనే సంస్థకు కాంట్రాక్ట్ అప్పగించినా కూన రవికుమార్ సోదరుడు సత్యనారాయణ, ఆయన అనుయాయులు, జన్మభూమి కమిటీ సభ్యులు సబ్ కాంట్రాక్ట్‌గా వ్యవహరించి పనులు చేపట్టారు. నాసిరకం పనులు చేపట్టడంతో నిర్మించిన కొన్ని రోజులకే తాడివలస వద్ద, సారవ గుమ్మి వద్ద చెక్‌డ్యామ్‌లు కొట్టుకుపోయాయి. రెల్లిగెడ్డ కోసమని నిర్మించిన రక్షణ గోడ కొన్ని రోజులకే కూలిపోయింది. వీరు చేసిన పాపాలకు ఇరిగేషన్ అధికారులు బుక్ అయ్యాయి. ఎనిమిది మంది ఇంజినీరింగ్ అధికారులపై జలవనరుల శాఖ సస్పెన్షన్ వేటు వేసింది.
- పొందూరు మండలం కింతలి–బొడ్డేపల్లి జెడ్పీ రోడ్డు నుంచి సింగూరు మీదుగా ఎన్‌హెచ్–5వరకు 4.75కిలోమీటర్ల తారు రోడ్డు వేశారు. ఈ రోడ్డు కాంట్రాక్ట్ పనులను కూన రవికుమార్ సోదరుడు విజయలక్ష్మీ కన్‌స్ట్రక్షన్ అధినేత కేవీ సత్యనారాయణ దక్కించుకున్నారు రూ. 2.86కోట్ల వ్యయంతో టీడీపీ ప్రభుత్వ హయాంలో వేసిన రోడ్డు కొన్ని నెలలకే పాడైపోయింది.
- కింతలి నుంచి సీపన్నాయుడు పేట వరకు రూ.4 కోట్ల నాబార్డు నిధులతో రోడ్డు పనులు చేశారు. ఈ పనులను కాంట్రాక్ట్‌ను కూన రవికుమార్ సోదరుడు వెంకట సత్యనారాయణ దక్కించుకున్నాడు. నాసిరకం పనులు చేయడంతో రోడ్డు పరిస్థితి అధ్వానంగా మారింది.
- పొందూరు గ్రామంలో జమాల్ మిల్లు నుంచి కళాశాల రోడ్డులోని అమ్మాజమ్మ టిఫిన్ దుకాణం వరకు కుడి వైపు రూ. 45 లక్షలతో సుమారు వెయ్యి మీటర్లు పొడవున కాలువలు నిర్మించారు. దీని కాంట్రాక్ట్‌ను కూన సోదరుడే దక్కించుకున్నాడు. ఈ కాలువలపై పలకలను వేయలేదు.
- వాంద్రంగి కూడలి నుంచి జోగన్నపేట వరకు రోడ్డు, కాలువల నిర్మాణానికి రూ. 4 కోట్లు నిధులు మంజూరయ్యాయి. దీని కాంట్రాక్ట్‌ను కూన రవికుమార్ సోదరుడే దక్కించుకున్నాడు. 2018–19లో అర్ధంతరంగా పనులు నిలుపుదల చేశారు. ఇంకా 200 మీటర్లు మేరకు రోడ్డును జోగన్నపేట వద్ద వేయాల్సి ఉంది. కాలువలను పూర్తి చేయలేదు. కొన్ని చోట్ల కాలువలు పూడుకుపోయాయి. అరకొరగా నిర్మించిన కాలువలపై పలకలను వేయలేదు.





సరుబుజ్జిలి మండలం యరగాం నుంచి సవలాపురం జంక్షన్ వరకు కూన రవికుమార్ సోదరుడు వెంకట సత్యనారాయణ రూ.40లక్షలకు కాంట్రాక్ట్ తీసుకుని వేసిన రోడ్డు కొన్ని రోజులుగా గుంతలు గుంతలుగా మారిపోయింది.



(ఫైల్)

రాపాక నుంచి దళ్లవలస మీదుగా కింతలి వరకు రూ. 7కోట్ల ఆర్ఐడీఎఫ్ నిధులతో రోడ్డు నిర్మించారు. కూన రవి కుమార్ సోదరుడు వెంకట సత్యనారాయణ ఈ రోడ్డు కాంట్రాక్ట్‌ను తీసుకున్నారు. నాసిరకం పనులు చేపట్టడంతో ఎక్కడ పడితే అక్కడ రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి.



(ఫైల్)



(ఫైల్)

ఆమదాలవలస మండలం రామచంద్రాపురం నుంచి జొన్నవలస గ్రామం వరకు 6కిలోమీటర్ల పొడవున రూ.2కోట్లతో వేసిన ఆర్అండ్‌బీ రోడ్డు కొన్ని రోజులకే గుంతలమయమైంది. కూన సోదరుడు వెంకట సత్యనారాయణకు చెందిన శ్రీ విజయలక్ష్మీ కన్‌స్ట్రక్షన్ కంపెనీయే ఈ పనులు చేసింది.



(ఫైల్)

విపత్తు నివారణ పథకం కింద బొడ్డేపల్లి జెడ్పీ రోడ్డు నుంచి సింగూరు మీదుగా ఎన్‌హెచ్–5 రోడ్డు వరకు రూ. 2.73 కోట్ల నిధులతో తారు రోడ్డు వేశారు. ఈ రోడ్డు సింగూరు వద్ద రెల్లుగెడ్డ గట్టు మీదుగా వెళ్తుంది. నాసిరకం పనులు చేపట్టడంతో రోడ్డు ఒక భాగం ఏకంగా కూలిపోయింది. కూన రవికుమార్ సోదరుడు విజయలక్ష్మి కన్‌స్ట్రక్షన్స్ అధినేత కూన వెంకట సత్యనారాయణ ఈ పనులు చేపట్టారు.

**అడుగడుగునా అవినీతి..**

ఆమదాలవలస నియోజకవర్గంలో ఇలా అడుగడుగునా వారు అవినీతికి పాల్పడ్డారు. ఇతరులకు కాంట్రాక్ట్‌లు దక్కిన సందర్భాలు తక్కువే. అంతా వారి కనుసన్నల్లోనే జరిగింది. టెండర్ల ప్రక్రియ నామమాత్రమే. ఎవరెక్కడ టెండర్ వేయాలో నిర్ణయించేది వీళ్లే. అంతా ఒక సిండికేట్‌గా తయారై గూడు పుఠాణి నడిపి పనులన్నీ దక్కించుకున్నారు. పోనీ దక్కిన పనులు నాణ్యతతో చేశారా అంటే అదీ లేదు. నాసిరకం పనులు చేసి ప్రజాధనాన్ని కొల్లగొట్టారు. ఇప్పుడా పనులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

### ఎంపీ స్థానానికి..

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసింది. శ్రీకాకుళం పార్లమెంట్ స్థానానికి 13 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ పత్రాల పరిశీలన పూర్తి చేశారు. వీరిలో జాతీయ, ప్రాంతీయ పార్టీల అభ్యర్థులకు వారి పార్టీ గుర్తులు కేటాయించగా, స్వతంత్ర అభ్యర్థులకు జిల్లా ఎన్నికల అధికారి ఎన్నికల ఓటింగ్ గుర్తులను కేటాయించారు.

**బరిలో వీరే..**

| అభ్యర్థి పేరు | పార్టీ |
|---|---|
| పేరాడతిలక్ | వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ |
| కింజరాపు రామ్మోహన్ నాయుడు | తెలుగుదేశం పార్టీ |
| నాయుడుగారి రాజశేఖర్ | బహుజన్ సమాజ్ పార్టీ |
| పేడాడ పరమేశ్వరరావు | ఇండియన్ కాంగ్రెస్ పార్టీ |
| ఇప్పిలి సీతరాజు | జై భారత్ నేషనల్ పార్టీ |
| కాయ దుర్గారావు | నవరంగ్ కాంగ్రెస్ పార్టీ |
| బొమ్మాళి తిరుపతిరావు | పిరమిడ్ ఆఫ్ ఇండియా పార్టీ |
| బోరుభద్ర చంద్రకళ | భారత చైతన్య యువజన పార్టీ |
| చెల్లూరి డేనియల్ | స్వతంత్ర్య అభ్యర్థి |
| బేత వివేకానంద మహారాజ్ | స్వతంత్ర్య అభ్యర్థి |
| యెద్దు లక్ష్మీనారాయణ | స్వతంత్ర్య అభ్యర్థి |
| వాబ యోగేశ్వరరావు | స్వతంత్ర్య అభ్యర్థి |
| సనపల శ్రావణ్ కుమార్ | స్వతంత్ర్య అభ్యర్థి |

### ఎమ్మెల్యే స్థానాల్లో..

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** జిల్లాలో 8 అసెంబ్లీ స్థానాలకు గాను 73 మంది బరిలో మిగిలారు. నామినేషన్ల ఉపసంహరణ పూర్తి కావడంతో బరిలో మిగిలిన అభ్యర్థులను ఆర్‌ఓలు ఖరారు చేశారు.

| నియోజకవర్గం | నామినేషన్లు | ఉపసంహరణ | బరిలో ఉన్నవారు |
|---|---|---|---|
| ఇచ్ఛాపురం | 13 | 04 | 09 |
| పలాస | 14 | 04 | 10 |
| టెక్కలి | 10 | 03 | 07 |
| పాతపట్నం | 13 | 03 | 10 |
| శ్రీకాకుళం | 10 | 03 | 07 |
| ఆమదాలవలస | 19 | 06 | 13 |
| ఎచ్చెర్ల | 17 | 07 | 10 |
| నరసన్నపేట | 11 | 04 | 07 |
| మొత్తం | 107 | 34 | 73 |



శ్రీకాకుళం వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థిగా పేరాడ తిలక్ పోటీ చేస్తున్నారు. టీడీపీ తరఫున కింజరాపు రామ్మోహన్ నాయుడు ఉన్నారు.



శ్రీకాకుళం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ధర్మాన ప్రసాదరావు ఉన్నారు. టీడీపీ తరఫున గొండు శంకర్ పోటీ చేస్తున్నారు.



ఆమదాలవలస వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తమ్మినేని సీతారాం బరిలో ఉన్నారు. టీడీపీ తరఫున కూన రవికుమార్ పోటీలో నిలిచారు.



ఎచ్చెర్ల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా గొర్లె కిరణ్‌కుమార్ పోటీలో ఉన్నారు. బీజేపీ తరఫున ఎన్.ఈశ్వరరావు బరిలో ఉన్నారు.



నరసన్నపేట నుంచి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ధర్మాన కృష్ణదాస్ పోటీ చేస్తున్నారు. టీడీపీ తరఫున బగ్గు రమణమూర్తి బరిలో దిగుతున్నారు.



టెక్కలి నుంచి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా దువ్వాడ శ్రీనివాస్ బరిలో నిలిచారు. టీడీపీ తరఫున కింజరాపు అచ్చెన్నాయుడు పోటీ చేస్తున్నారు.



పలాస నుంచి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా సీదిరి అప్పలరాజు పోటీ చేస్తున్నారు. టీడీపీ తరఫున గౌతు శిరీష బరిలో నిలిచారు.



ఇచ్ఛాపురం నుంచి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పిరియా విజయ బరిలో దిగుతున్నారు. టీడీపీ తరఫున బెందాళం అశోక్ పోటీ చేస్తున్నారు.



పాతపట్నం నుంచి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా రెడ్డి శాంతి ఉన్నారు. టీడీపీ నుంచి మామిడి గోవిందరావు పోటీలో ఉన్నారు.

## ఊరు హోరెత్తింది..

పల్లెలు, పట్టణాలు, వీధులు, కూడళ్లు.. ఎన్నికల ప్రచారాలతో హోరెత్తుతున్నాయి. అభ్యర్థులు అందరితో కలిసిపోతూ పార్టీ గుర్తును గుర్తు చేస్తున్నారు.



హిరమండలం: ఎమ్మెల్యే రెడ్డి శాంతి నగటు ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తలపై తాటాకు గొడుగుతో హిరమండలంలో ఉపాధి వేతనదారులతో మాట్లాడారు.



స్పీకర్ తమ్మినేని సీతారాం మున్సిపాలిటీ అంతా సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. తిమ్మాపురంలో పార్టీ కార్యకర్తలతో కలిసి ఇలా ప్రచారం నిర్వహించారు.

– ఆమదాలవలస



మంత్రి ధర్మాన ప్రసాదరావు మత్స్యకార పల్లెలను పలకరిస్తున్నారు. పెద్ద గనగళ్లవానిపేటలో ఇలా భారీ ర్యాలీ చేసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

–శ్రీకాకుళం రూరల్



మంత్రి సీదిరి అప్పలరాజు ప్రచారాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. పలాస మండలం పెదపలియా గ్రామంలో ఓ విద్యార్థిని సెల్ఫీ కోరడంతో ఇలా ఫొటో దిగారు.

– కాశీబుగ్గ



ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ మండలాలన్నీ చుట్టేస్తున్నారు. అల్లాడపేటలో ఇలా ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

– జలుమూరు



ఇచ్ఛాపురం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ జనం మనసులు గెలుచుకుంటున్నారు. కరాపాడు పంచాయతీలో ఓ వృద్ధురాలు నీకే ఓటేస్తానంటూ ఇలా ఒట్టేశారు.

– కవిటి



ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పల్లెల్లో జోరుగా ప్రచారం చేస్తున్నారు. నక్కపేటలో కూలీలో మమేకమై ఇలా నెత్తిన సున్నం ఎత్తారు.

– జి.సిగడాం



వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, టెక్కలి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ ఉత్సాహంగా ఎన్నికల ప్రచారాలు నిర్వహిస్తున్నారు. కోటబొమ్మాళి మండలం కొత్తపల్లిలో ఇలా ర్యాలీ చేశారు.

– కోటబొమ్మాళి

## క్లుప్తంగా

### ఆర్టీసీ సిబ్బందికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు



ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న విజయ్‌కుమార్

**శ్రీకాకుళం అర్బన్:** ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందికి జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ సోమవారం ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా సిబ్బంది ఎంతగానో కృషిచేస్తున్నారని, వారంతా వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు ఈ ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు పి.బి.మల్లికార్జునరాజు, కేఆర్ఎస్ శర్మ, అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, ఎస్ఎంఎల్ఎస్ నాయుడు పాల్గొన్నారు.

### నిచ్చెన పైనుంచి పడి తాపీమేస్త్రీ మృతి



శ్రీధర్ (ఫైల్)

**నరసన్నపేట:** మండలంలోని బాడాంలో సోమవారం జరిగిన ప్రమాదంలో గొనబుపేటకు చెందిన తాపీ మేస్త్రీ కోన శ్రీధర్ (39) మృతి చెందాడు. సురవరపు సద్గుణరావు ఇంటి వద్ద శ్రీధర్ పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు నిచ్చెన పైనుంచి పడిపోవడంతో మెడకు తీవ్ర గాయమైంది. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరసన్నపేట ఎస్ఐ అశోక్‌బాబు కేసు నమోదు చేశారు. కాగా శ్రీధర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు, తల్లిదండ్రులు ఉన్నారు.

### ఇరువర్గాలపై కేసు నమోదు

**టెక్కలి రూరల్ :** టెక్కలి నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగిన కొట్లాటలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టెక్కలి గొల్లవీధికి చెందిన కొందరు యువకులు స్థానిక పెట్రోల్ బంకు వద్దకు వెళ్లగా అక్కడే ఉన్న చేరివీధికి చెందిన యువకులు వారిని ప్రశ్నించగా ఇరువురి మధ్య మాటామాట పెరిగి కొట్లాటకు దారితీసింది. ఇరువర్గాలకు గాయాలు కావడంతో పోలీసులను ఆశ్రయించారు. గొల్లవీధికి చెందిన గిన్ని భాస్కరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చేరివీధికి చెందిన నలుగురిపై, చేరివీధికి చెందిన కె.సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొల్లవీధికి చెందిన నలుగురిపై కేసు నమోదు చేశారు.



- టీడీపీలో ఉండలేమంటున్న కార్యకర్తలు
- ధర్మాన కృష్ణదాస్ సమక్షంలో భారీగా చేరికలు



సుబ్రహ్మణ్యపురం టీడీపీ కార్యకర్తలకు పార్టీ కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

# నరసన్నపేట.. వైఎస్సార్‌సీపీ కంచుకోట



వనవిష్ణుపురం నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ శ్రేణులు

**నరసన్నపేట:** ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ వైఎస్సార్ సీపీలో చేరికల సందడి నెలకొంటోంది. ముఖ్యంగా నరసన్నపేట నియోజకవర్గం పార్టీ కంచుకోటగా మారుతోంది. ఇక్కడి టీడీపీ నేతల పోకడలకు విసిగిపోయిన కార్యకర్తలు, కీలక నాయకులు సిటింగ్ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. అన్ని చోట్ల నుంచీ టీడీపీని వీడుతున్నారు. వందలాది కుటుంబాలు బాబుకు గుడ్‌బై చెప్పేస్తున్నారు.

**నమ్మకం.. గౌరవం..**

ఒకవైపు జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు, మరోవైపు పార్టీ కార్యకర్తలు తలెత్తుకొనేలా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు వైఎస్సార్‌సీపీలో చేరేలా ఆకర్షిస్తున్నాయని టీడీపీ కార్యకర్తలు బాహాటంగానే చెబుతున్నారు. ఇలాంటి పార్టీలో ఉంటేనే తమకు గౌరవం ఉంటుందని భావిస్తున్నారు. మీ ఇంట్లో మంచి జరిగినట్లు భావిస్తేనే వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని ముఖ్యమంత్రి ఇస్తున్న పిలుపునకు స్పందించి, నరసన్నపేటలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌పై ఉన్న అభిమానంతో రోజూ ఏదో ఒక మండలంలో గ్రామాల నుంచి టీడీపీ శ్రేణులు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. తాజాగా సారవకోట మండలం కొమ్ముసరియాపల్లి, వడ్డినవలసల్లో 67 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. ఇదే మండలంలో వెంకటాపురంలో 31 కుటుంబాలు, తర్లిలో 62 కుటుంబాలు పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. జలుమూరు మండలం శ్రీముఖలింగంలో రెండు విడతల్లో 140 కుటుంబాలు, నగిరికటకంలో 60 కుటుంబాలు, అందవరంలో 40 కుటుంబాలు, జోనంకిలో 35 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరాయి. పోలాకి మండలం దండులక్ష్మీపురంలో 50 కుటుంబాలు అధికార పార్టీలో చేరడంతో దాదాపుగా ఈ గ్రామంలో టీడీపీ ఖాళీ అయింది. వ్యాపార కేంద్రం పిన్నింటిపేటలో జట్టు కళాసీలు, ఆటో డ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో 50 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. వనవిష్ణుపురం గ్రామానికి టీడీపీకి చెందిన వంద కుటుంబాలు వారం కింద ఎమ్మెల్సీ నర్తు రామారావు సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్యలు కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. నరసన్నపేట పట్టణానికి చెందిన 200 మంది యువకులు టార్గెట్-24 టీమ్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. కామేశ్వరిపేట నుంచి ఇసా కామేశ్వరరావు, కరగాం పంచాయతీలో వంద కుటుంబాలు పార్టీలో చేరాయి. దీంతో వైఎస్సార్ సీపీలో మరింత జోష్ పెరిగింది.

**పెరిగిన బలం..**

జలుమూరు మండలం నగిరికటకం గ్రామానికి చెందిన బగ్గ ఎర్రన్న, బూరి చంద్రరావు, అందవరంలో మోగిలి లక్ష్మణ, పీత అయ్యప్ప, వనవిష్ణుపురంలో మాజీ సర్పంచ్ పాలిన కృష్ణమూర్తి, దండులక్ష్మీపురంలో బమ్మిడి రాజు, సువ్వారి నాగరాజు, కరగాంలో రేగేటి రమణ, గొండు రామోజీ, కింజరాపు రవి, కింజరాపు సత్యం, దండులక్ష్మీపురంలో బమ్మిడి రాజు, సువ్వారి నాగరాజు, సారవకోట మండలం వెంకటాపురంలో రెడ్డి శ్రీరాములు, జగ్గారావు, పట్ట జగదీష్‌ల చేరికతో ఆయా గ్రామాల్లో వైఎస్సార్ సీపీకి మరింత బలం పెరిగింది.

## కళింగ వైశ్యులంతా వైఎస్సార్‌సీపీ వెంటే..

- వ్యక్తిగత ప్రయోజనాలకే కొందరు పార్టీ వీడారు
- కళింగ వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ అంధవరపు సూరిబాబు వెల్లడి



మాట్లాడుతున్న అంధవరపు సూరిబాబు

**శ్రీకాకుళం అర్బన్:** కళింగ వైశ్యులంతా(కళింగ కోమట్లు) వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే ఉన్నారని కళింగ వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ అంధవరపు సూరిబాబు స్పష్టం చేశారు. సోమవారం శ్రీకాకుళం టౌన్‌హాల్‌లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కళింగ వైశ్య ప్రతినిధులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళింగ వైశ్యుల ఆత్మగౌరవాన్ని నిలిపింది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని చెప్పారు. వైశ్యులను కించపరచి, అవమానించేలా ఉండటంతో వైశ్యుల మనోభావాలు గుర్తించి సాహసోపేత నిర్ణయంతో, 100 ఏళ్ల చరిత్ర కలిగిన 'చింతామణి' నాటకాన్ని నిషేధించిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అటువంటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కళింగవైశ్యులంతా రుణపడి ఉంటామని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకే ఓటువేసి రుణం తీర్చుకుంటామని చెప్పారు. ఈ ప్రభుత్వ హయాంలోనే కళింగ వైశ్యులకు మేలు జరిగిందన్నారు. ప్రశాంతంగా, నిర్భయంగా వ్యాపారాలు చేసుకున్నారని తెలిపారు. కేవలం కొన్ని జిల్లాల్లో మాత్రమే కళింగ వైశ్యులు బీసీ జాబితాలో ఉన్నారని, ఇదే విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టిలో పెడితే కళింగ కోమట్లను రాష్ట్ర వ్యాప్తంగా బీసీ జాబితాలో చేర్చారని గుర్తు చేశారు. ఓబీసీ సాధనకు సైతం జీవో విడుదలైందని, ఇంతటి మేలు చేసిన జగన్‌మోహన్‌రెడ్డితోనే తామంతా కలిసి నడిచి వైఎస్సార్‌సీపీని గెలిపించుకుంటామన్నారు. నిరుపేదలైన కళింగ కోమట్లకు జగనన్న పథకాలు చేరువయ్యాయన్నారు. 1800 మంది కళింగ వైశ్యులకు ఇళ్లు మంజూరయ్యారని తెలిపారు. ఇటీవల కొంతమంది కళింగ వైశ్య ప్రతినిధులు వారి వ్యక్తిగత స్వలాభం కోసమే వైఎస్సార్‌సీపీని వీడారని, కుల ప్రయోజనం కోసం ఎంత మాత్రం కాదని స్పష్టం చేశారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో దాదాపుగా 150 ఏళ్ల చరిత్ర కలిగిన పొట్టిశ్రీరాములు మార్కెట్‌ను రెవెన్యూమంత్రి ధర్మాన ప్రసాదరావు హయాంలోనే అభివృద్ధి చెందిందన్నారు. అటువంటి నాయకుని గెలుపుకోసం తామంతా అహర్నిశలూ కలిసి పనిచేస్తామని పునరుద్ఘాటించారు. కళింగ వైశ్య ప్రతినిధులు కోణార్క్ శ్రీను, అంధవరపు రామా, ఊన్న నాగరాజు తదితరులు మాట్లాడుతూ కళింగ కోమట్లకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ఎంతో మేలు జరిగిందన్నారు. తామంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం కృషిచేస్తామన్నారు. సమావేశంలో కళింగ వైశ్య ప్రతినిధులు అంధవరపు గోవు, తంగుడు నాగేశ్వరరావు, వైశ్యరాజు మోహన్‌రాజు పాల్గొన్నారు.

## పిడుగుపాటు.. ఐదుగురికి గాయాలు



ఇచ్ఛాపురం సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న ఇటుకబట్టీ కూలీలు

**ఇచ్ఛాపురం/ రూరల్:** ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని ఇటుక బట్టీపై పిడుగు పడటంతో ఐదుగురు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. జగన్నాథపురం -బి.నువగాం సరిహద్దులో గల ఇటుక బట్టీపై సోమవారం సాయంత్రం పిడుగు పడటంతో పదేళ్లలోపు చిన్నారులు సాలిని ఒగ్రెయ్, సంధ్య ఒగ్రెయ్‌లు గాయాలతో చెల్లా చెదురుగా పడిపోగా, కూలీలు కమల కిరణ్, సుమిత లెహర్‌లు అపస్మారక స్థితికి చేరుకున్నారు. మరో వ్యక్తి ఇస్మిత్ లెహర్ గాయాలతో బయటపడ్డాడు. స్థానికులు వెంటనే క్షతగాత్రులను ఇచ్ఛాపురం సామాజిక ఆస్పత్రికి తరలించారు. అలాగే స్థానిక గాంధీ పార్కులోని కొబ్బరిచెట్టుపై సోమవారం సాయంత్ర పిడుగు పడటంతో చెట్టు కాలిపోయింది. ఈ సమయంలో పార్కులో చిన్నారులు గానీ, వాకర్స్ గానీ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

### విద్యుత్ షాక్‌తో వ్యక్తికి గాయాలు



గాయపడిన అమ్మన్నరాజు

**టెక్కలి రూరల్:** టెక్కలిలోని నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద మెళియాపుట్టి రోడ్డులో విద్యుత్ షాక్‌కు గురై పోలాకి మండలం కాకినాడపేటకు చెందిన హనుమంతు అమ్మన్నరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. అమ్మన్నరాజు సోమవారం టెక్కలి ప్రాంతంలో ఫైబర్‌నెట్ మరమ్మత్తులు చేసేందుకు వచ్చాడు. మెళియాపుట్టి రోడ్డులోని విద్యుత్ స్తంభం ఎక్కి పనులు చేస్తుండగా 11 కేవీ లైన్ ప్రమాదవశాత్తు పట్టేయడంతో ఒక్కసారిగా షాక్‌కు గురై కింద పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు వివరాలు సేకరించారు.

### 'ఉమ్మడిగా దాడులు నిర్వహించాలి'



సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న సెబ్ డిప్యూటీ కమిషనర్ శ్రీరామచంద్రమూర్తి

**శ్రీకాకుళం క్రైమ్:** స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్), ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ విభాగాలు సమన్వయంతో పనిచేసి అక్రమ మద్యం నిల్వలపై ఉమ్మడిగా దాడులు నిర్వహించాలని విశాఖపట్నం సెబ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీరామచంద్రమూర్తి అధికారులను సూచించారు. ఫరీదుపేటలో ఉన్న జిల్లా సెబ్ కార్యాలయంలో సోమవారం ఈ మేరకు ఇరువిభాగాల అధికారులతో సెబ్ జాయింట్ డైరెక్టర్ డి.గంగాధర్ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ రిటైల్ మద్యం దుకాణాల్లో(జీఆర్వోల్లో) పని చేస్తున్న సిబ్బంది రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, అవకతవకలు జరిగితే చర్యలు తీసుకోవాలని, అనుమానిత సిబ్బందిపై నిఘా పెట్టాలన్నారు. ఇచ్ఛాపురం, కంచిలి, మెళియాపుట్టి, పాతపట్నం, కొత్తూరు మండలాల్లో ఉన్న స్టేషన్ల సిబ్బంది దాడులు మరింత ముమ్మరం చేసి అక్రమ మద్యం, నాటుసారాయి రవాణాను అరికట్టాలన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అసిస్టెంట్ కమీషనర్ బి.శ్రీనివాసులు, సెబ్ ఈఎస్ తిరుపతి నాయుడు, ఏఈఎస్ టి.రాజశేఖర్‌లు పాల్గొన్నారు.

### 25 మద్యం బాటిళ్లు స్వాధీనం

**ఎచ్చెర్ల క్యాంపస్:** మండలంలోని ధర్మవరం పంచాయతీ రుప్పపేటలో వారణాసి కాంతారావు వద్ద అక్రమంగా ఉన్న 25 మద్యం బాటిళ్లను ఎఫ్ఎస్‌టీ బృందం సోమవారం స్వాధీనం చేసుకుంది. బాటిళ్లు సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

### ఎన్నికల విధులకు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లను ఎన్నికల విధులకు వినియోగించుకునేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. వచ్చే నెల 13వ తేదీన పోలింగ్ జరిగే ఒక్కరోజు సామాజిక సేవ, స్వచ్ఛంద ప్రాతిపదికన వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఎస్పీ జీఆర్ రాధికతో కలిసి కలెక్టర్ తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2358 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఒక్కో కేంద్రానికి ఒక్కొక్కరు చొప్పున 18 ఏళ్లు నిండిన ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లను వినియోగిస్తామని, దీనిపై వారి తల్లిదండ్రుల నుంచి సమ్మతి పత్రాలు తీసుకోవాలని సూచించారు. వీరికి శాంతిభద్రతలకు సంబంధించి ఎలాంటి పనులు అప్పగించబోమని, ఓటరు సహాయం కోసం మాత్రమే వీరి సేవలను వినియోగిస్తామని స్పష్టం చేస్తారు. ఎస్పీ జీఆర్ రాధిక మాట్లాడుతూ ఎన్‌సీసీ క్యాడెట్లు 852 మంది అందుబాటులో ఉన్నారని, అలాగే ఎన్ఎస్ఎస్ వలంటీర్లు 1774 ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. పోలింగ్ విధుల్లో పాల్గొనే వీరికి భోజన, వసతి, రవాణా సదుపాయం కల్పిస్తామని అన్నారు.

### వేట నిషేధ నిబంధనలు ఉల్లంఘన

**రణస్థలం:** నాలుగు ఇంజిన్ బోట్లతో చేపల వేట నిషేధ ఉత్తర్వులు ఉల్లఘించి సముద్రంలో వేటకు వెళ్లిన జీరుపాలెం గ్రామానికి చెందిన నలుగురు మత్స్యకారులకు జరిమానా విధించినట్లు మండల మత్స్యశాఖ అధికారి కె.గంగాధరరావు, కళింగపట్నం మెరైన్ ఏఎస్సై రవి తెలిపారు. అంబటి చిరంజీవి, బర్రి అప్పన్న, దుమ్ము కాముడు, దుమ్ము మహేందాతలు సోమవారం ఇంజిన్ బోట్లతో వేటకు వెళ్లారంటూ గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు తీరానికి చేరుకుని వాస్తవమేనని నిర్ధారించి గ్రామపెద్దల సమక్షంలో నలుగురిపై కేసు నమోదు చేశారు. రూ.ఐదువేల ఆపరాధ రుసుం, లైసెన్సు రద్దు, మత్స్యకార భరోసా నిలిపివేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లింగాల ఆదినారాయణ, వీఆర్వో పి.సుబ్రహ్మణ్యం, వీఎఫ్‌వో వై.రవికుమార్, గ్రామ సచివాలయ సిబ్బంది, మత్స్యకారులు ఉన్నారు.



శ్రీకాకుళం రూరల్: పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానించిన మంత్రి ధర్మాన ప్రసాదరావు

# టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి..



పొందూరు: పార్టీలో చేరిన వారితో స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్



పలాస: పార్టీలోకి జనసేన కార్యకర్తలను ఆహ్వానిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

**పలాస:** మందస మండలం కొంకడాపుట్టి పంచాయతీ సవర కొంకడాపుట్టి గ్రామానికి చెందిన 20 మంది జనసేన కార్యకర్తలు సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. పలాస మండలం లొత్తూరు గిరిజన గ్రామాల్లో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఎన్నికల ప్రచారం చేస్తుండగా సరిహద్దు మందస గ్రామాల నుంచి పెద్ద ఎత్తున జనం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సమక్షంలో జనసేన కార్యకర్తలు వైఎస్సార్ సీపీ కండువాలు ధరించి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి అప్పలరాజు మందస గిరిజన గ్రామాలను ఎంతగానో అభివృద్ధి చేశారని, పార్టీలో చేరామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సవర హరినారాయణ, సవర శివ, క్లస్టర్ ఇన్‌చార్జి బృందావన, సర్పంచ్ మజ్జి కుమార్‌చంద్ర, గౌడ కురా, లండ కోదండరావు తదితరులు పాల్గొన్నారు.



రణస్థలం: పార్టీలో చేరిన మెంటాడ కార్యకర్తలతో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

**రణస్థలం:** మండలంలోని మెంటాడ పంచాయతీ దోనిపేటలో టీడీపీకి చెందిన 10 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో సోమవారం చేరారు. దోని అప్పన్న తదితరులకు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. రణస్థలంలోని క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బాకి అర్జున్ రెడ్డి, పాల రామసూరి, సీరపు మల్లేష్, సీరపు లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

**శ్రీకాకుళం రూరల్:** మండలంలోని వాకలవలస గ్రామానికి చెందిన పలువురు యువకులు మంత్రి ధర్మాన ప్రసాదరావు సమక్షంలో సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. సర్పంచ్ మనోజ్ ఆధ్వర్యంలో పేడాడ కాంతారావు, పేడాడ కోటేశ్వరరావు, పేడాడ రామారావు, మెట్ట రమేష్, బంటుపల్లి రాజారావు, పేడాడ రాజశేఖర్, పేడాడ సురేష్, తమ్మినేని మని తేజా, మొదలవలస చల్లరావు, బెండి తవిటినాయుడు, వాగులపల్లి శేషు, మరో 10 మంది యువకులకు మంత్రి ధర్మాన కండువాలు వేశారు.

**పొందూరు:** మండలంలోని కింతలి గ్రామంలో కాంగ్రెస్, టీడీపీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఆమదాలవలస నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాం, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ చైర్మన్ దుంపల లక్ష్మణరావుల సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, విజయనగరం జిల్లా ఇన్‌చార్జి పైడి నాగభూషణరావు, రాష్ట్ర సేవాదళ్ కో-ఆర్డినేటర్ హనుమంతు విశ్వేశ్వరరావుతో పాటు సింగూరు ధనుంజయరావు, కూటికుప్పల హిమగిరి, పైడి కృష్ణారావు, పూజారి శ్యామలరావు, కంచరాన శేఖర్, పైడి శ్రీనివాసారవు, పైడి ముఖలింగం, మరో 100 కుటుంబాల వారు ఉన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, మండల పార్టీ అధ్యక్షుడు పప్పల రమేష్ కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, నాయకులు పప్పల రాధాకృష్ణ, సింగూరు సూర్యనారాయణ, తేజేశ్వరరావు, బొమ్మాలి గిరి తదతరులు పాల్గొన్నారు.

## రిక్షా తాతకు మళ్లీ ప్రమాదం

- కారు ఢీకొనడంతో కొనఊపిరితో కేజీహెచ్‌లో చికిత్స



గాయాలతో వృద్ధుడు రామారావు

**శ్రీకాకుళం క్రైమ్ :** తన నేస్తం తిరిగి వచ్చిందన్న ఆనందం ఆ వృద్ధునికి ఎంతో సమయం నిలవలేదు. పోలీసులు ఎంత చెప్పినా వినకుండా నగరంలోని అదే కొత్త బ్రిడ్జి వద్ద పడుకున్న రిక్షా తాత కంటా రామారావును ఆదివారం అర్ధరాత్రి కారు ఢీకొనడంతో మరోసారి ప్రమాదానికి గురై కొనఊపిరితో చికిత్స పొందుతున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. గత మార్చి నెలలో కొత్తబ్రిడ్జి వద్ద ప్రమాదానికి గురైన వృద్ధుడు రామారావును ట్రాఫిక్ సీఐ అవతారం, సిబ్బంది వైద్య చికిత్స చేయించి ఇటీవలే కొత్త రిక్షాను ఇప్పించారు. రాత్రిపూట మున్సిపల్ స్కూల్ గ్రౌండ్లో సేదతీరాలని కూడా చెప్పారు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి దాటాక విశాఖపట్నం నుంచి వచ్చి కారు కొత్త బ్రిడ్జి వద్ద వృద్ధుడ్ని, రిక్షాను ఢీకొట్టింది. ఈ విషయం ఏపీహెచ్‌బీ కాలనీకి చెందిన కరకవలస వడ్డిబాబుకు ఓ వ్యక్తి ఫోన్ చేయడంతో ఘటనాస్థలికి వెళ్లి చూడగా వృద్ధుడు అపస్మారక స్థితిలో పడివున్నాడు. వెంటనే 108 అంబులెన్సులో రిమ్స్‌కు తరలించగా తలకు తీవ్ర గాయం కావడంతో కేజీహెచ్‌కు తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు. కారు డ్రైవర్ సానావీధికి చెందిన పరిమళ్ల కొర్లయ్యగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు పేర్కొన్నారు.